# నవభూమి కరీంనగర్

అనుబంధం

18 సెప్టెంబర్,2024 బుధవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in




## వేములవాడలో గణేష్
# నిమజ్జనం



**వేములవాడ, -నవభూమి:** గణనాథుడి నిమజ్జనోత్సవం వేములవాడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వినా యక చవితి పర్వదినం నాడు వాడవాడలా వెలసి తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న ఆది దేవుడు విఘ్నేశ్వరుడు సోమవారం సాయంత్రం కన్నుల పండుగ సాగిన శోభాయాత్ర అనంతరం గుడి చెరువులో ఒదిగి పోయాడు. విఘ్నాలను తొలగించి, శుభాలను ప్రసాదించే బొజ్జ గణపయ్యను భక్తి శ్రద్ధలతో పూజించిన పట్టణ ప్రజలు వైభవంగా శోభాయాత్ర నిర్వహించి గుడి చెరువులో నిమజ్జనం శారు. పట్టణంలోని పలు వీధుల్లో సుమారు 200కు పైగా పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేయగా, పెద్ద క్రేన్ల సాయంతో పెద్ద విగ్రహాలను శోభాయాత్ర కోసం అందంగా అలంకరించిన వాహ నాలపై ఉంచి గణపతి బప్పా మోరియా.. అంటూ మేళతాళాల మధ్య ఊరేగించారు. భక్తి పాటలకు అనుగుణంగా నృత్యాలు, భజనలు చేస్తూ పట్టణ వీధుల మీదుగా కన్నుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. నిమజ్జనోత్సవ ఊరేగింపు సాంప్రదాయబద్ధంగా సాగగా, కాషాయ దుస్తులు ధరించిన నాయకులు, గణేశ్ ఉత్సవ నిర్వాహకులు ముందు నడిచారు. ఒగ్గుడోలు బృందం కళాకారుల ప్రదర్శనతోపాటు హైదరాబాద్ నుండి రప్పించిన కళాకారుల రకరకాల వేషాధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు గణేశ్ శోభాయాత్ర లో నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆదిశ శ్రీనివాస్ గణేష్ నిమజ్జోత్సవం శోభాయాత్రలో పాల్గొని నిర్వాహకులు, యువకులతో కలిపి భక్తి పాటలపై చిందేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి నేతృత్వంలో సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## త్యాగధనులకు ఉపాధి..ఏడేళ్లుగా దిక్కేది?





## అర్ధాంతరం..రహదారులు
# ఆగమాగం

**ధర్మపురి: -నవభూమి:** పట్టణంలో పలు రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత ప్రభుత్వం కొన్ని ప్రారంభించి వదిలేయగా.. మిగతా పనులు శంకుస్థాపనకు సైతం నోచుకోలేదు. నిధులు విడుదల కాకపోవడంతో పనులన్నీ పెండింగులోనే ఉన్నాయి. 15 శాతమే పూర్తి..ఎన్‌హెచ్63 నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వస్తుంటాయి. ఈ రోడ్డు అధ్వానంగా మారగా.. గతంలో దీనిని సీసీగా మార్చేందుకు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ రహదారిని ప్రారంభించి ఇరువైపులా వెడల్పు చేసి వదిలేశారు. కేవలం 15శాతం పనులే పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డు పక్కన ఎలాంటి మట్టి పోయకపోవడంతో ప్రమాదకరంగా మారింది.ఎన్నికల కోడ్ రావడంతో..పురపాలిక పరిధిలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ. 1.30కోట్ల నిధులతో పనులు చేపట్టారు. 280 మీటర్ల వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలను దాదాపుగా పూర్తిచేశారు. కేవలం 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి చేపట్టే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయి.కంకర తేలి.. ప్రమాదరకరంగా మారి అంబేద్కర్ కూడలి నుంచి అక్కపల్లి ఆలయం వరకు రహదారి నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. రహదారిని వెడల్పు చేయడంతోపాటు రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ రోడ్డుకు సంబంధించి 30శాతం పనులు పూర్తిచేసి నిలిపివేశారు. రహదారి వెడల్పుతోపాటు, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ప్రతిపాదించారు. నిధులు విడుదల కాకపోవడంతో ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది.రూ. 6 కోట్లు విడుదల చేసినా..జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారిని ఏర్పాటుచేసి మధ్యలో సెంట్రల్ లైటింగు పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ. 6 కోట్ల నిధులు విడుదల చేసింది. అయితే రహదారిని వెడల్పు చేసి ఓ వైపు కంకర పోసి నిలిపివేశారు. 30శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. నిధులు కేటాయించి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ప్రతిపాదనలు పంపించాం నిధులు మంజూరు కాగానే నిలిచిన రహదారి నిర్మాణ పనులు చేపడతాం. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదలు పంపించాం. అనుమతులు రాగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.



## ఎల్ఎండీ గేట్లు ఎత్తారు.. మూసివేశారు!



**తిమ్మాపూర్, –నవభూమి:** దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ) నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు ఇన్ఫ్లో తగ్గుముఖం పట్టడంతో రెండు గంటలలోనే గేట్లను మూసివేశారు. జలాశయానికి మధ్యమానేరు జలాశయం నుంచి కొంత వరద వస్తుండగా ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్కిల్–2 ఎస్ఈ రమేశ్, ఈఈ నాగభూషణరావు, ఇతర అధికారులతో కలిసి సోమవారం ఉదయం 9.30 గంటలకు రెండు గేట్లను ఎత్తి ఒక్కో గేటు నుంచి 1500ల క్యూసెక్కుల చొప్పున దిగువకు 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాని మళ్లీ కేవలం రెండు గంటల అనంతరం గేట్లను మూసి వేసి కాకతీయ కాల్వ ద్వారా దిగువకు నీటి విడుదల ప్రారంభించారు. కాకతీయ కాల్వలో మొదటగా 500ల క్యూసెక్కులతో నీటి విడుదలను ప్రారంభించి క్రమంగా 3వేల క్యూసెక్కులకు పెంచారు. జలాశయం పూర్తి సామర్థ్యం 24.034టీఎంసీలు కాగా 23.903టీఎంసీల నీరున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ విషయమై ఎస్ఈ రమేశ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా మధ్యమానేరు నుంచి వచ్చే ఇన్ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేశామని, ఎండల తీవ్రత కొంచెం ఎక్కువగా ఉండడంతో రైతుల పంట పొలాలను దృష్టిలో ఉంచుకుని వారి కోరిక మేరకు కాకతీయ కాల్వ ద్వారా విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. మధ్య మానేరు నుంచి నీటి విడుదల బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం నుంచి ఎల్ఎండీకి సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7,350 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ఇక్కడి నుంచి ఎల్ఎండీకి 3,136, అన్నపూర్ణ జలాశయానికి 6,400 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరామసాగర్‌కు తగ్గిన వరద జగిత్యాల ధరూర్‌క్యాంపు : శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రం వరకు ఇన్ఫ్లో 10,465 క్యూసెక్కులకు తగ్గింది. వరద కాలువకు నీటి విడుదలను 2 వేల క్యూసెక్కులకు తగ్గించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ, జెన్‌కో విద్యుత్తు ఉత్పత్తికి 6,800 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200, సరస్వతి కాలువకు 550, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయి మేరకు 80.501 టీఎంసీల నీటి నిల్వ, 1091.00 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## మత్స్యకారుడి వలకు 28 కిలోల చేప

**తిమ్మాపూర్–నవభూమి:** ఎల్ఎండీ జలాశయంలో మత్స్యకారుడి వలకు భారీ చేప చిక్కింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగంపల్లికి చెందిన కూన తిరుపతి రోజులాగే సోమవారం ఎల్ఎండీ జలాశయానికి చేపల వేటకు వెళ్లగా 28 కిలోల భారీ బొచ్చె చేప వలకు చిక్కింది. దాని విలువ సుమారు రూ.5వేల వరకు ఉంటుందని తిరుపతి తెలిపారు. ఇంత పెద్ద చేప చిక్కడం ఇదే మొదటి సారి అని తిరుపతి సంతోషం వ్యక్తం చేశారు.



# పెరుగుతున్న అసాంక్రమిక వ్యాధిగ్రస్థులు

**పెద్దపల్లి –నవభూమి:** రోజువారీ జీవనశైలిలో పని ఒత్తిడి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా చిన్న వయసులోనే అసాంక్రమిక వ్యాధులు ప్రజలను చుట్టుముడుతున్నాయి. జిల్లాలో 30 ఏళ్లు దాటిన ప్రతీ పది మందిలో ఒకరికి రక్తపోటు, ప్రతీ 20 మందిలో ఒకరు మధుమేహంతో బాధపడుతున్నట్లు వైద్యశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, ఛాతిక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి మూడేళ్లుగా జిల్లాలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఏటా ఆరువేలకు పైగా... జిల్లాలో అసాంక్రమిక వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. జిల్లాలో మూడేళ్ల క్రితం ఈ సంఖ్య 30వేల వరకు ఉండగా ప్రస్తుతం 50 వేలకు చేరువగా ఉంది. ఏడాదికి ఆరు వేలకు పైగా కొత్త వారిని గుర్తిస్తున్నారు. జిల్లాలో 30 ఏళ్లకు పైగా 4.10 లక్షల మంది ఉండగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1.09 లక్షల మందిని పరీక్షించారు. వచ్చే ఫిబ్రవరి నాటికి మిగిలిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అయిదు రకాల వ్యాధుల నిర్ధారణ అసాంక్రమిక వ్యాధులపై నాన్‌కమ్యూకేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) పథకంలో మూడేళ్ల నుంచి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆసుపత్రి, మంథని, గోదావరిఖని, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రతి ఊరిలో ఎన్‌సీడీ కేంద్రం ఉంది. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లక్షణాలు, కిడ్నీ సంబంధిత, మానసిక ఒత్తిళ్లకులోనైన వారిని పరీక్షిస్తున్నారు. మానసిక ఒత్తిళ్లకు గురైతే 14416 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని అవగాహన కల్పిస్తున్నారు. జీవన విధానంలో మార్పులు రావాలి జిల్లాలో అసాంక్రమిక వ్యాధులకు సంబంధించి నిరంతరం పరీక్షలు చేపట్టి నిర్ధారణ చేస్తున్నాం. ముఖ్యంగా ఆహార అలవాట్లలో జాగ్రత్తలు



తీసుకోవాలి. నూనె పదార్థాలు, మసాలా దినుసులు, కారం, ఉప్పు వినియోగం తగ్గించాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. సమయాన్ని బట్టి వ్యాయామం చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

# వరదలొస్తే.. రాకపోకలు బంద్

**ఎల్లారెడ్డిపేట: –నవభూమి:** లోలెవల్ వంతెనలతో ఇక్కట్లు కోరుట్లపేట వద్ద ఇటీవల నీట మునిగిన పారేటి వాగు ఎల్లారెడ్డిపేట మండలంలోని వాగులపై ప్రభుత్వం వారధులను నిర్మించడం లేదు. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని చోట్ల ఇరుకుగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారాయి. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట వద్ద పారేటి(గంగమ్మ) వాగుపై ఉన్న లోలెవల్ వంతెన ఏటా వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వరద ఉద్ధృతికి మూడు నుంచి నాలుగు రోజులు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ వారధి నిర్మించక ప్రయాణ కష్టాలు తీరడం లేదు. నారాయణపూర్, బండలింగంపల్లి నడుమ పారేటి వాగు, పెద్దమ్మ ఒర్రె వాగులపైన లోలెవల్ కాజ్‌వేల వద్ద కొద్దిపాటి వర్షాలకే వరద ఉద్ధృతికి రవాణా స్తంభించి చాలా గ్రామాలకు చెందిన వారు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న రెండు రోడ్‌డ్యాంలు చిన్నపాటి వర్షాలకు నీటిలో మునిగిపోతుంటాయి. దీంతో గొల్లపల్లి నుంచి రాజన్నపేట మీదుగా అల్మాస్‌పూర్, వీర్నపల్లి మండలంలోకి ప్రవేశించే ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి అక్కపల్లికి వెళ్లే రహదారి మధ్యలో వాగుతో స్థానికులు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద ప్రవాహంతో గ్రామస్థులకు దూరాభారం తప్పడం లేదు. రోజుల తరబడి నీరు పారుతుండటంతో నాచు పేరుకుపోయి, వాహనాలు అదుపు తప్పుతున్నాయి. తిమ్మాపూర్ నుంచి బాకురుపల్లితండాకు వెళ్లే రోడ్డులో లోలెవల్ కాజ్‌వే గతంలో కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమై కూలిపోయే దశకు చేరుకుంది. కనీసం మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. మండలంలోని పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి నడుమ



ఉన్న రోడ్డు రెండు మండలాలను కలుపుతుంది. మానేరు వాగులో కొన్నేళ్ల కిందట నిర్మించిన లోలెవల్ కాజ్‌వే చాలా వరకు కొట్టుకుపోయి ధ్వంసమైంది. దీని మీదుగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ వంతెన నిర్మిస్తే రెండు మండలాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పదిర, రామలక్ష్మణపల్లి గ్రామాల నడుమ మానేరు వాగుపై వారధి నిర్మాణానికి రూ. 6 కోట్ల సీఆర్‌ఆర్ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అలాగే అక్కపల్లి వద్ద వాగుపై ఉన్న కాజ్‌వే స్థానంలో వంతెన ఏర్పాటుకు రూ.కోటి సీఆర్‌ఆర్ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, నిర్మాణాలు ప్రారంభిస్తాం. కోరుట్లపేట వద్ద పారేటి వాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే ఆర్‌అండ్‌బీ పరిధి కిందకు వస్తుంది.

## వందేభారత్ రైలు వచ్చేసింది..




**గోదావరిఖని, -నవభూమి:** నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడపనున్న వందేభారత్ రైలును.. రామగుండం రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి పెద్దపల్లి లోక్‌సభ సభ్యులు వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. నాగ్‌పూర్‌లో వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించగా.. రాత్రి 9 గంటలకు రామగుండం చేరుకోవడంతో లాంఛనంగా ప్రారంభించారు. నాగ్‌పూర్ నుంచి బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. చంద్రాపూర్, బల్లార్ష మీదుగా రామగుండం చేరుకుంది. ఇక్కడి నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సేవలు ప్రయాణికులు వినియోగించుకోవాలని ఎంపీ కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మేయర్ అనిల్‌కుమార్, పోలీసు కమిషనర్ శ్రీనివాస్, నాయకులు సంధ్యారాణి, రైల్వే అధికారులు ఉన్నారు.

## పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి



**వేములవాడ, -నవభూమి:** గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. వేములవాడలో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గణేష్ శోభాయాత్ర సాఫీగా సాగే విధంగా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులదేనని, శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. అనంతరం గుడి చెరువు కట్టపై గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తును ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలిసి పరిశీలించారు. పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెస్‌కు తోడ్పాటు అందించండి

**సిరిసిల్ల -నవభూమి:** సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. కరీంనగర్‌లో సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సెస్ చైర్మన్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా సెస్ పరిధిలోని విద్యుత్ బకాయిలతోపాటు సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ రాయితీలను సెస్‌కు అందించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ సహకార సరఫరా సంస్థలను కాపాడుకోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని సెస్‌కు అందించి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి డైరెక్టర్లు కొట్టెపల్లి సుధాకర్, వరసు కృష్ణహరి పాల్గొన్నారు. కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సోమవారం జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ కుమార్‌ను కలిసి సమస్యలను విన్నవించారు.

## త్యాగధనులకు ఉపాధి..

# ఏడేళ్లుగా దిక్కేది?



**సిరిసిల్ల, -నవభూమి:** దయనీయంగా మధ్యమానేరు నిర్వాసితులుపని లేక ఇతర ప్రాంతాలకు వలసలు వ్యవసాయ పనులకు ఆటోలో వెళ్తున్న కూలీలు వ్యవసాయమే జీవనాధారమైన పల్లెల్లో రైతులు, ఇతర వృత్తుల వారికి ఏడాదంతా పని ఉంటుంది. అదే పట్టణంలో అయితే అందుకు భిన్నం. మధ్యమానేరు జలాశయంలో వేలాది ఎకరాలు ముంపునకు గురికాగా.. వందలాది కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. ప్రభుత్వం పలు రకాల పరిహారం, నివేశన స్థలాలు ఇచ్చింది. వాటిలో ఇళ్లు నిర్మించుకుని, పల్లెల నుంచి పట్టణ వాతావరణంలోకి మారారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం చాలా కుటుంబాలు ఉపాధి లేక దయనీయస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాయి. ప్రభుత్వం వీరి ఉపాధి విషయంలో ఇదిగో అదిగో అంటూ ఏడేళ్లుగా కాలం వెళ్లదీస్తోంది. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు బోయినపల్లి, వేములవాడ గ్రామీణం: జిల్లాలో ముంపు గ్రామాల్లోని యువతకు సుస్థిర ఉపాధి కల్పన, సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించడానికి ఇప్పటికీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేవీ కార్యరూపం దాల్చలేదు. వ్యవసాయం, ఇతర వృత్తులపై ఆధారపడిన వారంతా ఇప్పుడు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వలస వెళ్తున్నారు. యువత గ్రానైట్ పరిశ్రమల్లోకి, మరికొందరు హైదరాబాద్, కరీంనగర్ వంటి నగరాల్లోని వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్నారు. జిల్లాలోని డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన యువకులు డ్రైవర్లుగా ఉపాధి పొందుతున్నారు. సొంతంగా రవాణా రంగంలో స్థిరపడాలనుకునే వారికి పథకాలేవీ లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. గీత కార్మికులకు తాటి, ఈత వనాల పెంపకంతో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం హరితహారంలో ఆబ్కారీశాఖ గిరకతాళ్లను నాటింది. వేములవాడ గ్రామీణం, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో వీటి సంరక్షణ లేక పెరగడం లేదు. గీత కార్మికులు ఇతర గ్రామాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఆక్వాహబ్ ఏర్పాటుకు గత ప్రభుత్వం ఫిషిన్ అనే సంస్థతో ఎంవోయూ చేసుకుంది. ఇది ప్రారంభమైతే చేప పిల్లల పెంపకం, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతులు వంటి పలు కంపెనీలు జిల్లాలో విస్తరించేవి. ఆయా రంగాల్లో సుమారు పది వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించేది. దీంతోపాటు అర్హులైన ప్రతి కుటుంబానికీ రాయితీపై పాడి గేదెలను అందిస్తామని ఇచ్చిన హామీలేవీ కార్యరూపం దాల్చలేదు. మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు డీఆర్డీఏ, పరిశ్రమల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. గార్మెంట్ యూనిట్లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలపై రెండేళ్ల క్రితం ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చారు. రెండు నెలల క్రితం అనుపురంలో నెల రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. మిగతా కాలనీల్లోనూ శిక్షణనిస్తే సిరిసిల్లలోని అపరెల్ యూనిట్ల ప్రారంభంతో ఉపాధి లభించే అవకాశం ఉంది.




# విశ్వనేత్ర.. శోభాయాత్ర

**కొత్తపల్లి, -నవభూమి:** వాయిద్య చప్పుళ్లు.. యువతీ యువకుల కేరింతలు.. నృత్యాలు.. కోలాటాలు..ఒగ్గుడోలు ప్రదర్శనలు.. సంప్రదాయ దుస్తులతో గణనాథుల నిమజ్జనోత్సవ శోభాయాత్ర వైభవంగా సాగింది. దారి పొడవునా యువతీయువకుల నృత్యాలతో హోరెత్తించారు. సోమవారం మధ్యాహ్నం నుంచే నగరంలో నిమజ్జనానికి గణనాథులు తరలివెళ్లారు. కరీంనగర్ నగరం నుంచి కొత్తపల్లి, మానకొండూరు, చింతకుంట ప్రాంతాలకు విగ్రహాలు వెళ్లాయి. పాతబజారులోని ఒకటో నంబర్ వినాయకునికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్వాగతం పలకగా మేయర్ సునీల్‌రావుతో కలిసి పూజలు చేసి ఊరేగించారు. టవర్ సర్కిల్‌లో విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోమళ్ల రాజేందర్‌రెడ్డి, ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు. భక్తులతో దారులు కిటకిటలాడాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, దుకాణదారులు ప్రసాదాలు, నీళ్లు వితరణ చేశారు.

